క్లుప్తంగా

ఎస్‌టీఎం విభాగంలో రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ (ఎస్‌టీఎం) విభాగంలో ఆదివారం సెక్షన్ రౌండ్ 80 ఎం.ఎం 2,434 టన్నుల రికార్డు ఉత్పత్తి జరిగింది. 2023 డిసెంబర్ 31న అత్యధికంగా 2,375 టన్నులు అత్యధిక ఉత్పత్తి జరగ్గా ఇప్పుడు అంత కంటే ఎక్కువగా ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేసింది. ఈ సందర్భంగా విభాగం ఉద్యోగులను విభాగం అధికారులు అభినందించారు.

న్యూపోర్టు హెచ్‌సీకి సీపీ అభినందనలు



హెచ్‌సీ రాజేష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ డాక్టర్ రవిశంకర్

పెదగంట్యాడ: యారాడ తీరంలో విదేశీయునిపై దాడి చేసిన ఘటనలో చాకచక్యంగా వ్యవహరించి 12 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్ అభినందించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ క్రైం హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజేష్‌ను అభినందిస్తూ సోమవారం ప్రశంసాపత్రం అందజేశారు.

ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు వైష్ణవి



అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో 85వ వార్డు ఫార్మాసిటీ కాలనీ ఏబీఎస్ పాఠశాలకు చెందిన కె.వైష్ణవి పాల్గోనుంది. ఇటీవల నిర్వహించిన ఎస్జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా పోటీల్లో సత్తా చాటిన వైష్ణవిని విశాఖ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 30న నరసారావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవి పాల్గొంటున్నట్టు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎం. కొండయ్య తెలిపారు.

సిద్ధార్థనగర్ కాలనీని సందర్శించిన ఎంపీ జీవీఎల్



ఎంపీ జీవీఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న సిద్ధార్థ నగర్ ప్రజలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి సిద్ధార్థనగర్ కాలనీని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సోమవారం సందర్శించారు. కాలనీ ప్రధాన సమస్య అయిన 22ఏ రిజిస్ట్రేషన్ల అంశాన్ని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కో-కన్వీనర్ లక్కరాజు సోమరాజు ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో, ఎంపీ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థనగర్ మెయింటెనెన్స్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1082వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బీసీ రోడ్డుకు మహర్దశ

- రూ.2 కోట్లతో రహదారి నిర్మాణం
- రేపు శంకుస్థాపన



కాకతీయ ఆర్చ్ నుంచి బీసీ రోడ్డు



బీసీ రోడ్డు పనుల గురించి జీవీఎంసీ డీఈ అప్పారావుతో మాట్లాడుతున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: బీసీ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. కాకతీయ కూడలి నుంచి గంగవరం పోర్టు వంతెన వరకు రహదారి నిర్మాణం చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 31న నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం రూ.2కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో బీసీ రోడ్డును వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జీవీఎంసీ డీఈ అప్పారావు సోమవారం పరిశీలించారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో..

రహదారి గురించి స్టీల్‌ప్లాంట్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చొరవ తీసుకుని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మకు పరిస్థితిని వివరించారు. దీంతో కమిషనర్ రోడ్డును పరిశీలించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం రోడ్డంతా గతుకులమయం కావడంతో వెంటనే కొత్తగా రోడ్డు నిర్మించేందుకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం..

ప్రస్తుతం ఈ రోడ్డును రూ.2 కోట్లతో నిర్మించనున్నారు. ఆపై మాస్టర్ ప్లాన్ ప్రకారం కాకతీయ కూడలి నుంచి గంగవరం పోర్టు వంతెన వరకు 150 అడుగుల మేర విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఇక రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి, ఆపై రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఆ తర్వాత మరో రూ.37కోట్ల స్టీల్‌ప్లాంట్ నిధులతో ఈ రహదారిని అత్యద్భుతంగా రూపుదిద్దేందుకు ప్లాన్‌ను సిద్ధం చేశామని స్టీల్‌ప్లాంట్ అధికారులు తెలుపుతున్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయడంతో పాటు అందులో కొత్తగా విద్యుత్ స్తంభాలను అమర్చనున్నారు. ఆపై రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించనున్నారు. డివైడర్ మధ్యలో అందమైన మొక్కలు కూడా నాటనున్నారు.

గతంలో శ్రీకారం చుట్టినా..

ఈ రోడ్డు పనులకు 2021లోనే ప్రారంభించి, కొన్ని ఆక్రమణలు కూడా తొలగించారు. తర్వాత కొందమంది కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో అప్పట్లో పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇప్పుడు ఎటువంటి అభ్యంతరాలు, అవాంతరాలు లేకుండా పనులను పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో అధికారులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యకు ఇక చెక్

బీసీ రోడ్డులో నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. గంగవరం పోర్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఆటోనగర్‌లోని పరిశ్రమల్లో పని చేసే వారికి ఇదే ప్రధాన రహదారి. అయితే రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టి ఆక్రమించడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పుడు ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ చేపడితే ఇక ట్రాఫిక్ సమస్యలు ఉండవని వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్ పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు

- వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా పథకాల అమలు
- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు



ప్రభుత్వ పథకాలను తెలిపే కరపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఉరుకూటి చందు

కూర్మన్నపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలన్న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయసాధనే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తూ వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా చేస్తున్నారన్నారు. జీవీఎంసీ 87వ వార్డు గణేష్‌నగర్ సచివాలయ పరిధిలోని ముస్లిం వీధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉరుకూటి చందు గడపగడపకు వెళ్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంతృప్త స్థాయిలో అమలుచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొడ్డ గోవింద్, జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి కనకరావు, వడ్లపూడి ఈశ్వరరావు, సీరపు పాపారావు, కోటి రెడ్డి, పట్నాన అప్పారావు, కర్రి అప్పారావు, సచివాలయ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న సభ్యులు

కూర్మన్నపాలెం: అవార్డులు సమాజంలో బాధ్యతను మరింత పెంచుతాయని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వెటరన్ సేవా అవార్డు లభించిన మాజీ సైనికుడు పీవీఎస్ మూర్తిని సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ సన్మూర్తి, అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షుడు పీవీఎస్ఎన్.గోపాల్, జిల్లా కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి, ప్రతినిధులు పాల్గొన్నారు.

4న విప్రోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణ, సుబ్బారావు, వ్యాసశర్మ

అగనంపూడి: బ్రాహ్మణుల వెనుకబాటుతనంపై చర్చించేందుకు వచ్చేనెల 4వ తేదీన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి బ్రాహ్మణ సంఘాల నేతృత్వంలో గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న విప్రోత్సవం విజయవంతం చేయాలని అగనంపూడి శారదా గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ధర్మాల సుబ్బారావు, జి.పూర్ణానందశర్మ (పూర్ణ), ధర్మాల వ్యాసశర్మ కోరారు. అగనంపూడిలోని పూర్ణ కార్యాలయంలో 85వ వార్డు శారదా గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ సమావేశంలో బ్రాహ్మణుల ఆర్థిక, రాజకీయ, సామాజిక వెనుకబాటుతనంపై చర్చిస్తారన్నారు. విప్రోత్సవం అనంతరం బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కె.చరణ్, కె.వి.రామభద్రుడు, చిన్న శ్రీను, బి.వెంకట సత్యారామకృష్ణ, చింతా రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ' వీక్షించిన విద్యార్థులు



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి ప్రధాని మోదీ సోమవారం నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం ఏర్పడింది. పరీక్షల సమయంలో ఆందోళనను అధిగమించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రసంగం అనంతరం ప్రధాని మోదీ వివరించిన అంశాలను హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం విద్యార్థులకు తెలుగులో వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేముళ్లు, కుమార స్వామి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం వినతి

గాజువాక: దళిత కాలనీల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కోరుతూ 69వ వార్డు దళిత సంఘాల నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో జెడ్సీని కలిసి వివిధ సమస్యలను వివరించారు. 69వ వార్డులోని దళిత కాలనీలో రోడ్లు, కాలువలను, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు పెట్ల అర్జున్‌రావు, ములకలపల్లి వెంకటేష్, రామారావు తదితరులున్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

- ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'
- జిల్లా స్థాయి పోటీలకు జట్ల ఎంపిక
- విజేతలకు బహుమతుల ప్రదానం



క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక కన్వీనర్ చందు, జెడ్సీ సింహాచలం



ట్రోఫీలు, సర్టిఫికెట్లతో మహిళా క్రీడాకారులు



ఖోఖో, బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న గుడివాడ లతీష్

గాజువాక: ఆడుదాం ఆంధ్రా గాజువాక నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. పురుషులు, మహిళా కేటగిరీల్లో నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులను ప్రదానం చేశారు. ప్రతి క్రీడాంశంలో మొదటి స్థానంలో జట్టుకు రూ.30వేలు, రెండో స్థానం సాధించిన జట్టుకు రూ.20వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో విజేతలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ డి.లక్ష్మారెడ్డి తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యం కల్పించారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) పేర్కొన్నారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీల్లో నియోజకవర్గంలోని క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు ఎస్.ఎం.డి.గౌస్, నాయకులు అచ్చంనాయుడు, చిత్రాడ అప్పారావు, సదరం కార్పొరేషన్ ప్రతినిధి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత సీడబ్ల్యూసీ

ఉక్కునగరం: ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల విజేతగా కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ (సీడబ్ల్యూసీ) జట్టు నిలిచింది. ఉక్కు స్టేడియంలో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఎల్.వి.నగర్, సీడబ్ల్యూసీ జట్లు పోటీ పడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎల్.వి.నగర్ జట్టు 10 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి, 92 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సీడబ్ల్యూసీ జట్టు 8.4 ఓవర్లకు రెండు వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసి గెలుపొందింది. అనంతరం గాజువాకలో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, జోనల్ కమిషనర్ సింహాచలం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్ పోటీల ఇన్‌చార్జి, గ్రౌండ్ ఇన్‌చార్జి మన్నాజీరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ విజేత నాతయ్యపాలెం జట్టు

అక్కిరెడ్డిపాలెం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో నాతయ్యపాలేనికి చెందిన మహిళా కబడ్డీ జట్టు విజేతగా నిలిచింది. గాజువాక హైస్కూల్లో జరిగిన ఫైనల్స్‌లో దిబ్బపాలెం జట్టుపై వీరు విజయం సాధించారు.జట్టు సభ్యులకు 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు నాతయ్యపాలెంలోని ఆయన నివాసంలో అభినందనలు తెలిపారు.

ఖోఖో, బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల్లో 68వ వార్డు సచివాలయం నుంచి మహిళల ఖోఖో జట్టు, రాంనగర్ సచివాలయం నుంచి పురుషుల ఖోఖో జట్టు, అక్కిరెడ్డిపాలెం సచివాలయం నుంచి బ్యాడ్మింటన్ జట్టు విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు, సహకరించిన సచివాలయ సిబ్బందికి వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అభినందనలు తెలిపారు.

జగనే మళ్లీ సీఎం కావాలనేది ప్రజల ఆకాంక్ష

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- రూ.69వ వార్డులో రూ.4కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



షీలానగర్‌లో డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ప్రజలంతా జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమాన్ని తమ ఇంటికి తెచ్చిన జగనన్నే తమ నాయకుడని ప్రజలు భావిస్తున్నారన్నారు. 69వ వార్డులో సుమారు రూ.4 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను 99శాతం నెరవేర్చి, నవరత్నాల ద్వారా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెందుతుందన్నారు. పార్టీలు, జెండాలు చూడకుండా, వైఎస్సార్ సీపీకి ఓటు వేయని వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేయమని చెప్పిన గొప్పనాయకుడు సీఎం జగన్ అన్నారు. ఇప్పటి వరకు గాజువాక నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి ఏ ఎమ్మెల్యే చేయలేదన్నారు. కార్పొరేటర్ల సహకారంతో సంతృప్తికరంగా అభివృద్ధి పనులు పూర్తి చేశానన్నారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, బీసీ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, వార్డు మహిళా అధ్యక్షురాలు కమరున్నిసా బేగం, నాయకులు అప్పారావు, రామాంజనేయులు, గోపి, రవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డులో చేపట్టనున్న పనులు

- రూ.99.90 లక్షలతో నాతయ్యపాలెంలో కళ్యాణ మండం నిర్మాణం
- రూ.36.05 లక్షల వ్యయంతో కృష్ణ మహంతి చెరువు చుట్టూ విద్యుత్ లైట్ల ఏర్పాటు
- రూ.19.45 లక్షలతో బంగారమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ల నిర్మాణం
- రూ.19.24 లక్షలతో నాతయ్యపాలెం ఇంటర్నల్ రోడ్డు నిర్మాణం
- రూ.49.45 లక్షలతో హరిజనజగ్గయ్యపాలెంలో ఆర్‌సీసీ డ్రైన్ల నిర్మాణం
- రూ.49.39 లక్షలతో నాతయ్యపాలెంలోని ముస్లింల ఖబరిస్థాన్ నిర్మాణం
- రూ.96.05 లక్షల వ్యయంతో నాతయ్యపాలెంలోని క్రైస్తవ శ్మశాన వాటిక నిర్మాణం
- రూ.14.1 లక్షలతో నాతయ్యపాలెంలోని ఆర్‌సీసీ కల్వర్టు అప్రోచ్ నిర్మాణం
- రూ.19.3 లక్షలతో తుంగ్లాంలో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ల నిర్మాణం

ఉత్తమ సేవలకు గుర్తింపు



ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వైద్యులు, సిబ్బందిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

అగనంపూడి: ప్రజల మన్ననలు పొందేలా సేవలు అందించేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము అన్నారు. అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి, హెడ్ నర్స్ కె.రాజేశ్వరి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అలాగే గతేడాది నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ ఉష, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ వి.ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ టి.హేమలక్ష్మిలకు సేవా పురస్కారాలు దక్కాయి. వీరిని అగనంపూడి ఆస్పత్రి కమిటీ, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి మాట్లాడుతూ ఆస్పత్రి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కమిటీ ప్రతినిధులు, స్థానికుల సహకారంతో ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ ప్రతినిధులు గొలగాని శ్రీను, దానబాల అప్పలనాయుడు, బలిరెడ్డి సత్యనారాయణ, లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, వైద్యులు డాక్టర్ లీలావతి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

విపత్కర వేళల్లో రక్షణపై శిక్షణ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై 68వ వార్డు మింది వద్ద గల మానస డిఫెన్స్ అకాడమీలో శిక్షణ తరగతులను నిర్వహించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని, నీటిలో మునిగిపోతున్న వారిని ఎలా రక్షించాలి, విపత్తులు సంభవించినప్పుడు ఎత్తయిన భవనాల్లో చిక్కుకున్న వారిని తాడు సహాయంతో ఎలా కాపాడాలి అనే విషయాలను శిక్షణ ద్వారా వివరించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సమన్వయకర్త బండి సురేష్, బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ రణధీర్ సింగ్ రావత్, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, రాష్ట్ర సేవాదళ్ సమన్వయకర్త డి.రాఘవరావు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త ఆర్.ఏ.నాయుడు, సమితి కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

గాజువాక: ఉజ్వల పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లను ఎంపీ జీవీఎల్ నర్సింహారావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఆటో డ్రైవర్లకు ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేశారు.

కాంగ్రెస్, వామపక్షాల వల్లే విశాఖ ఉక్కు నిర్వీర్యం

కాంగ్రెస్ పార్టీ, వామపక్షాల నిరంకుశ వైఖరి వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యమైందని జీవీఎల్ నర్సింహారావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రులు కమీషన్లకు అలవాటు పడి వ్యవస్థలను నాశనం చేశారని ఆరోపించారు. వామపక్షాలు అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పుడు తనపై ఆ పార్టీల నాయకులు అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడింది, కాపాడుతున్నదీ బీజేపీయేనని చెప్పారు. బ్లాస్ట్‌ఫర్నేస్ ఏర్పాటుతో ప్లాంట్ మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు సోంబాబు, జీలకర్ర రమణ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కూర్మన్నపాలెం: భర్త, అత్తమామల వేధింపులు తాళలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కూర్మన్నపాలెంలోని అంబేడ్కర్ కాలనీ రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పక్కన పార్వతీపురానికి చెందిన సైలాడ పాండురంగారావు.. తన భార్య ప్రమీల (31), ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. వీరికి 2012లో వివాహం కాగా, 11 ఏళ్ల బాబు నితీష్‌కుమార్, 4 ఏళ్ల పాప నిహారిక ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటలకు పాండురంగారావు మావయ్య పువ్వల శంకరరావుకు ఫోన్ చేసి ప్రమీల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడు. దీంతో పార్వతీపురం నుంచి శంకరరావు దంపతులు కేజీహెచ్‌కు చేరుకుని బోరున విలపించారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకోవడంపై అల్లుడు పాండురంగారావు, ఆయన తల్లిదండ్రులే కారణమని దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న పీఎఫ్, ఈఎస్‌బీఎఫ్ ట్రస్టీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఎంప్లాయీస్ సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఈఎస్‌బీఎఫ్) ట్రస్టుల మాజీ చైర్మన్, ఆ ట్రస్టుల ప్రస్తుత ట్రస్టీ ఎన్. శ్రీనివాసరావును ట్రస్టీలు ఘనంగా సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఉక్కు పరిపాలన భవనంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా పీఎఫ్, ఈపీఎస్ 95, ఉద్యోగుల పెన్షన్ సెటిల్మెంట్లు తదితర అంశాలను చర్చించారు. రెండు ట్రస్టులకు చైర్మన్‌గా సేవలు అందించిన హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ, నూతన చైర్మన్ హెచ్.కె.ఝాలను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి, ఫైనాన్స్ డీజీఎం సూరిశెట్టి రామ్‌ప్రసాద్, ట్రస్టీలు పాల్గొన్నారు.